RNI Regd. APTEL No. 2009/29147 Postal Regd. No. J/NLR/078/20-22

# ఆంధ్రలక్ష్మి



జాతీయ తెలుగు వార పత్రిక

సంపుటి : 15 సంచిక : 34 ఎడిటర్ : ఎస్.కె. గౌస్‌బాషా తేది : 03-05-2024 పేజీలు : 8 వెల : 6/-

# దేశ సంపద... కొద్ది మంది చేతిలోనే..!

* అగమ్యగోచరంగా పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు
* ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు, సామాజికవేత్తల ఆందోళన



ప్రపంచంలో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఐదో స్థానంలో ఉన్నదని మోడీ ప్రభుత్వం చెప్తున్నది. తమ పాలనలో భారత్ సాధించిన ఘనతగా దీనిని బీజేపీ ప్రచారం చేసుకుంటున్నది. అయితే, దేశంలో సంపద మాత్రం కొద్ది మంది చేతుల్లోనే పోగై ఉన్నదనీ, పేద, మధ్య తరగతి ప్రజలు ఇప్పటికీ ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటున్నారని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా, 2014లో కేంద్రంలో మోడీ సర్కారు కొలువైనప్పటి నుంచి పదేండ్లలో దేశంలో దారుణ పరిస్థితులు ఏర్పడ్డాయని వారు చెప్తున్నారు. అంబానీలు, అదానీలు ఒకరితో ఒకరు పోటీపడి ప్రపంచ సంపన్నులుగా ఎదుగుతున్నారనీ, పేద, మధ్య తరగతి ప్రజలు మాత్రం కనీసం ఆదాయం లేక విలవిలలాడుతున్నారని అంటున్నారు. మోడీ పాలనలో పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణం, ధరలు, నిరుద్యోగం వంటి అంశాలు సామాన్య ప్రజలకు శాపంగా మారాయని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. ఇవన్నీ చూస్తే.. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీషు కాలంలో ప్రజలు అనుభవించిన అసమానతల కంటే మోడీ పాలనలోనే అసమానతలు అధికంగా ఉన్నాయని వారు విశ్లేషిస్తున్నారు. అవినీతిని రూపుమాపుతాననీ, నల్లధనాన్ని తీసుకొస్తాననీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని హామీలు గుప్పించి 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ.. బడా వ్యాపారవేత్తలు, కార్పొరేట్లకు దాసోహమన్నారని చెప్తున్నారు. వారికి అనుకూలంగా చట్టాలు తేవటం, సవరణలు చేయటం, పాలసీలు ప్రవేశపెట్టటం జరుగుతున్నదని అంటున్నారు. మోడీ పదేండ్ల పాలనలో పరిస్థితులు ఏమీ మారలేదనీ, దేశంలో ధనిక, పేదల మధ్య అంతరం అధికంగా ఉన్నదని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారత్లో ఆదాయం, సంపదల్లో అసమానతలు ప్రపంచంలోనే అత్యధికం. ఇది బ్రెజిల్, దక్షిణాఫ్రికా, యూఎస్‌లకంటే అధ్వాన్నంగా ఉన్నదని ప్రపంచ అసమానత ల్యాబ్ (డబ్ల్యూఐఎల్)కొత్త అధ్యయనం వెల్లడించింది. ఇటీవల ప్రచురితమైన 'ది రైజ్ ఆఫ్ ది బిలియనీర్ రాజ్'లోని పరిశోధన దేశంలో ఆదాయ అసమానత వాస్తవానికి బ్రిటిష్ వలస పాలనలో ఉన్నదానికంటే దారుణంగా ఉన్నదని చూపిస్తున్నది. భారత్లో పెరుగుతున్న సంపద అంతరం రాజకీయంగా చర్చకు దారి తీసింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ.. మోడీ పాలనలో సాంప్రదాయకంగా వెనుకబడిన వర్గాలు ఎంతగా నష్టపోయాయో తెలియజేస్తూ కుల గణనను నిర్వహిస్తామని హామీ ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. 1930లలో చాలా వరకు బ్రిటిష్

(తరువాయి 2వ పేజీలో)


## ఏపీలో కూటమి మ్యానిఫెస్టో విడుదల



ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడిగా ఏర్పాటు చేసుకున్న ఎన్డీయే కూటమి తమ ఎన్నికల మ్యానిఫెస్టోను ఇవాళ విడుదల చేసింది. ఇందులో భారీ హామీలు ఇచ్చారు. ఇప్పటికే టీడీపీ మినీ మ్యానిఫెస్టో రూపంలో ఇచ్చిన గ్యారంటీలతో పాటు జనసేన, బీజేపీ ప్రతిపాదించిన పలు హామీలకూ ఇందులో చోటు కల్పించారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు ఇలా అన్ని రంగాల వారినీ సంతృప్తి పర్చేలా ఇందులో పలు హామీలున్నాయి. కూటమి మ్యానిఫెస్టోలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఆడబిడ్డ నిధి పథకం కింద 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న ప్రతీ మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని, ప్రతీ ఇంటికీ ఉచిత కుళాయి కనెక్షన్ ఇస్తామని, ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం పేరుతో ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందిస్తామన్నారు. వృద్ధాప్య పింఛన్లను ఏప్రిల్ నుంచి 4 వేలకు, వికలాంగులకు రూ.6 వేలకు, పూర్తి వికలాంగులకు రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని కూటమి మరో హామీ ఇచ్చింది. ప్రతీ రైతుకు ఏటా రూ.20 వేలు ఇస్తామని తెలిపింది. అలాగే ప్రతీ ఇంటికీ ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని పేర్కొంది. బీసీల రక్షణకు ప్రత్యే

(తరువాయి 5వ పేజీలో)

## భర్తల కోసం భార్యలు... భార్యల కోసం భర్తల పొలిటికల్ కష్టాలు..?



రాజకీయాలు మారాయి. ఒకప్పుడు భర్తలు ఎన్నికల రంగంలో ఉంటే.. భార్యలు ఉడతా భక్తిగా ప్రచార కార్యక్రమాలు చూసుకునేవారు. అది కూడా నామమాత్రంగానే. వైఎస్ రాజ శేఖరరెడ్డి 30 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఏనాడూ ఆయన సతీమణి విజయమ్మ బయటకు రాలేదు. కనీసం జెండా కూడా పట్టుకోలేదు. చంద్రబాబు పరిస్థితి కూడా అంతే. ఇక, అన్నగారు ఎన్టీఆర్ సతీమణి బసవ తారకం కూడా.. ఏనాడూ బయటకు వచ్చి.. పార్టీ కోసం పనిచేయలేదు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. భార్యలు బయటకు వస్తున్నారు. ప్రచార కార్యక్రమాలు చూసుకుంటున్నారు. ఇక్కడ చిత్రం ఏంటంటే.. భార్యల కోసం భర్తలు రంగంలోకి దిగుతుండడం. ఇది రివర్స్ అన్నమాట. తమ భార్యల గెలుపు కోసం.. ఎండలను కూడా లెక్క చేయకుండా.. భర్తలు.. ప్రజల్లో తిరుగుతున్నారు. ఉన్నపనులు కూడా పక్కన పెట్టి మరీ.. పోటీలో ఉన్న భార్యా మణి విజయం కోసం తపిస్తున్నారు. ఈ ఇంట్రస్టింగ్ స్టోరీ ఇదీ.. బీజేపీ ఏపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి రాజమండ్రి పార్లమెంటు స్థానం నుంచి బరిలో ఉన్నారు. అయితే.. ఈమె కన్నా.. ఈమె భర్త, సీనియర్ నాయకుడు..దగ్గుబాటి వెంకటేశ్వరరావు బరిలో ప్రచారం చేస్తున్నారు. రాజమండ్రిలోనే రెండు వారాలుగా తిష్ఠ వేసిన ఆయన భార్య గెలుపు

(తరువాయి 4వ పేజీలో)

www.andhralaxmitelugu.in వెబ్‌సైట్‌లో వార్తలు చూడండి!

తేది : 03-05-2024 ఆంధ్రలక్ష్మి 2 సంపుటి : 15 సంచిక : 34

# ట్రాఫిక్ ... సౌండ్స్‌తో... బీకేర్‌ఫుల్..!

ట్రాఫిక్ గురించి ఎంత చెప్పినా తక్కువే అయిపోతుంది. ఉదయం ఆఫీసుకు వెళ్లాలన్నా.. రాత్రి ఇంటికి వెళ్లాలన్నా ట్రాఫిక్ వలన చాలా సమస్యలు ఎర్కొంటున్నారు. రోడ్డు నిండా ఎక్కడికక్కడికి వాహనాలు నిలిచిపోయి, 10 నిమిషాల దూరానికి కూడా గంట సేపు వేయిట్ చేసే పరిస్థితులు ఎదురు అవుతున్నాయి. దీని వలన ఆఫీసుకు వెళ్లే వారు ఉదయం 10 గంటలకు ఆఫీసు ఉంటే, 8.30కే బయలుదేరే పరిస్థితులు వచ్చాయి. ఈ ట్రాఫిక్ వలన చాలా మంది సతమతం అయిపోతుంటారు. ఇంకొంత మంది అయితే గంటలు తరబడి ట్రాఫిక్‌లో ఉండటం వలన నీరస, అలసటకు లోను అవుతుంటారు. అంతే కాకుండా కొంత మంది తమ ఫ్యామిలీతో ఎక్కువ సేపు గడపలేకపోతున్నామనే బాధతో, మానసికంగా కుంగిపోతుంటారు.ఇక ఇవన్నీ బాధలు చాలవు అన్నట్లు, తాజాగా చేసిన ఓ అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయంట. ట్రాఫిక్ శబ్ధంవల్ల గుండె సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. కొంత మంది త్వరగా ఆఫీసుకు వెళ్లాలని టిఫిన్ కూడా చేయకుండా త్వర త్వరగా వచ్చేస్తుంటారు. దీంతో సిగ్నల్ పడిందంటే అంతే ఇక, మన చుట్టూ ఉన్నవారు చిన్న సందు చూసి వెళ్లిపోదామని, హారన్స్ కొడుతూ ఇబ్బంది పెడుతారు. అయితే ఈ ట్రాఫిక్ సౌండే మన గుండెకు భారంగా మారుతోందంట. కొన్నిరకాల గుండె జబ్బులు, వాటి ప్రమాద కారకాలపైన పరిశోధకులు అధ్యయనం చేయగా,అందులో ట్రాఫిక్ సౌండ్స్ వల్ల గుండె సమస్యలు బాగా పెరుగుతున్నాయని, ట్రాఫిక్ సౌండ్స్? ప్రతి 10 డెసిబుల్స్ పెరుగుదల అనేది గుండె సంబంధింత వ్యాధుల ప్రమాదాన్ని 3.2 శాతం పెంచుతుందని ఈ అధ్యయనంలో కనుగొన్నారు. సర్క్యులేషన్ రీసెర్చ్ జర్నల్‌లో దీని గురించి పూర్తిగా వివరించారు. అలాగే నైట్ టైమ్‌లో ట్రాఫిక్ సౌండ్ వలన



ఒత్తిడి పెరిగిపోయి, మానసిక ఒత్తిడి పెరుగుతుందని, దీని కారణంగా రక్తపోటు, వాపు, వాస్కులర్ వ్యాధులను ఇది పెంచుతుందని, అలాగే డయాబెటీస్ ముప్పు కూడా ఉందని పరిశోధకులు తెలిపారు. అందువలన అందుకే జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రద్దీగా ఉండే రోడ్లలో నో హార్న్ అనే బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సౌండ్‌ను కంట్రోల్ చేయవచ్చని, దీని వలన ప్రజారోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకున్నట్లు ఉంటుదంటున్నారు. అలాగే ప్రజారోగ్యంలో భాగంగా.. శబ్ధ నియంత్రణ చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలని పరిశోధకులు చెప్తున్నారు.

## దేశ సంపద... కొద్ది మంది చేతిలోనే..!

(1వ పేజీ తరువాయి)

వారు భారతదేశాన్ని పాలించినప్పుడు ధనవం తులైన 1 శాతం మంది.. జాతీయ ఆదాయంలో కేవలం 20 శాతం కంటే ఎక్కువ మాత్రమే కలిగి ఉన్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఆ వాటా పడిపోయింది. 1940లలో అది సుమారుగా 10 శాతానికి చేరుకున్నది. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందినప్పుడు అది దాదాపు 12.5 శాతానికి చేరుకున్నది. ఇది 1960ల చివరి వరకు అలాగే కొనసాగింది. అప్పటి ప్రభుత్వాలు భారత్లో కొంతమేర సోషలిస్టు ఎత్తు గడలను అమలు చేయటంతో ఆర్థిక పరిస్థితులు కుదుటపడ్డాయి. అధికారిక రాచరిక రాజ్యాలకు చెల్లించే చెల్లింపులు రద్దయ్యాయి. బ్యాంకులు జాతీయం చేయబడ్డాయి. టాప్ 1 శాతం మంది ధనికుల్లో జాతీయ ఆదాయం వాటా 1982 నాటికి దాదాపు ఆరు శాతానికి పడిపోయింది. 1991లో భారత్ తన ఆర్థిక వ్యవస్థను సరళీకృ తం చేయటంతో పరిస్థితులు మారడం ప్రారం భించాయి. 2000 ఏడాది చేరటానికి టాప్ 1 శాతం మంది.. భారతదేశ ఆదాయంలో 15 శాతానికి పైగా కలిగి ఉన్నారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చేసరికి 20 శాతం దాటటం గమనార్హం. 2022-2023 నాటికి, ఇది అధికంగా 22.6 శాతానికి చేరుకున్నదని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఈ గణాంకాలు.. మోడీ సర్కారు సంపన్నుల కోసం ఎంత కష్టపడుతున్నదోనన్న దృగ్విషయాన్ని వెల్లడిస్తున్నదనీ, పేదలు, మధ్య తరగతి పట్ల ప్రభుత్వానికి ఉన్న ఉదాసీన వైఖరిని స్పష్టం చేస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో, పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు అగమ్య గోచరంగా మారాయని అంటున్నారు. రాబోయే ఎన్నికల్లోనైనా ప్రజలు ఆలోచించి ఓటు వేసి.. తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

## స్త్రీలపై నేరాలు... నగరాల్లోనే ఎక్కువ..!

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం ఏటికేడు మహిళలపై నేరాలు పెరుగుతున్నట్లు తేలింది. వారి గణాంకాలను ప్రకారం దేశవ్యాప్తంగా స్త్రీలపై నేరాల సంఖ్య 2020 సంవత్సరంతో పోల్చితే 15.3% పెరిగి 2021 సంవత్సరంలో 428,278 కేసులు నమోదయ్యాయి. దీన్నిబట్టి 2021లో స్త్రీలపై జరిగిన నేరాల సంఖ్య పెరిగిందే కానీ తగ్గలేదని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా మహిళల భద్రతకు భరోసా లేకుండా పోయిందనే విషయాన్ని ఈ నివేదిక సుస్పష్టం చేసింది. ఎవరికివారు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమకన్నా ఎక్కువ నేరాలు నమోదైన రాష్ట్రంతో పోల్చుకుని మహిళలకు తాము మాత్రమే భరోసా ఇస్తున్నాం అంటూ గప్పాలు కొట్టుకోవడమే కానీ పరిస్థితుల్లో మాత్రం ఏ మార్పూ లేదు. ప్రతి ఏటా ఎన్‌సీఆర్‌బీ నివేదికలను విడుదల చేస్తూ, నేరాల సంఖ్య పెరగడానికి గల కారణాలను కూడా చెబుతుంది. మహిళలకు సంబంధించే కాక హత్యలు, ఆత్మహత్యలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలు, వేధింపులు, ఎస్సీ, ఎస్టీ హక్కుల రక్షణ, బాలలపై నేరాలు వంటి అంశాలకు సంబంధించి కూడా గణాంకాలను సేకరించి, క్రోడీకరించి ఎన్‌సీఆర్‌బీ నివేదికలు రూపొందిస్తుంది. మన దేశానికి సంబంధించి నమోదు అయిన అన్ని తరహా నేరాలను పరిగణనలోకి తీసుకొని ఈ నివేదికలు విడుదల చేస్తుంది. దేశానికి రాజధాని అయిన ఢిల్లీ మహిళలకు భద్రత లేని మెట్రోపాలిటన్ నగరమని ఎన్‌సీఆర్‌బీ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2021 గణాంకాల ప్రకారం ఢిల్లీలో మహిళలపై జరిగిన నేరాల సంఖ్య 13,892 కాగా 2020తో పోల్చితే ఇది 40% అధికం. మెట్రో నగరాల కేటగిరీలో నమోదైన మొత్తం కేసుల్లో ఒక్క ఢిల్లీలోనే 33.2% నమోదయ్యాయి. ఇక ఆ తర్వాత ముంబై, బెంగళూరు ఉన్నాయి. అంటే నాగరికత మరీ ఎక్కువై ఈ నేరాలు జరుగుతున్నాయా అనే సందేహం వస్తుంది. ఎవరు, ఏంటి, ఎక్కడ అనే నిఘా లేకపోవడం, అధిక జనాభా, వలసలు ఇవన్నీ కూడా ఈ నేరాలకు కారణంగా ఉన్నాయి. రాజధానికి చేరువలో ఉండే రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కూడా స్త్రీలపై జరిగే నేరాల సంఖ్య అధికంగానే ఉంది. మాట వినలేదని, ప్రేమించలేదని, కులాంతర వివాహం చేసుకుందని.. ఏదో ఒక కారణంతో స్త్రీలపై దౌర్జన్యం చేయడం అలవాటుగా మారింది. ముఖ్యంగా స్త్రీలు అక్షరాస్యులు కావాలి. ఆత్మ స్థైర్యం, వ్యక్తిత్వ వికాసానికి చదువే మూలం అని వారు తెలుసుకోవాలి. దేశంలో అత్యంత నిరాదరణకు గురైంది, వార్షిక బడ్జెట్లో తక్కువ కేటాయింపులు చేసేది విద్యారంగానికే. వాస్తవానికి మనదేశంలో జీడీపీ 6% వరకు విద్యకు కేటాయించాలని దశాబ్దాల క్రితమే మేధావులు సిఫార్సు చేశారు. కానీ ఇప్పటికీ 4% కూడా దాటలేదు. 2019-20లో 2.8%, 2020-21లో 3.1, 2021-22లో 3.1% కేటాయింపులు జరిగాయని స్వయంగా దేశ ఆర్థిక మంత్రి వెల్లడించారు. తిరిగి అందులో మహిళలు, బాలికల విద్యకు ఎంత కేటాయిస్తున్నారంటే జవాబు లేని ప్రశ్నే అవుతుంది. ఆర్థికాభివృద్ధిలో దేశం ముందంజ అంటారు కానీ మానవాభివృద్ధి



సూచికలో మహిళలు కనబడరు. ఆడవాళ్ళందరికీ నిర్బంద ఉన్నత విద్య అనే షరతు పెట్టాలి. వారికి అవకాశాలు ఇచ్చి సమాజంలో ఉన్నతంగా నిలిపినప్పుడే ఈ నేరాల సంఖ్య తగ్గుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ముగ్గురిలో ఒకరు వారి సన్నిహితులు భాగస్వాముల నుంచి లైంగిక హింసకు గురవుతున్నారని గణాంకాలు చెప్తున్నాయి. ఈ పరిస్థితులు మారాలి అంటే రాజకీయ చిత్తశుద్ధి ఉండాలి. మీడియా కూడా నేరాలు తగ్గించడంలో పాత్ర వహించాలి. నా దాకా వస్తేనే అనే వ్యక్తిగత ఆలోచన మారనంత వరకు స్త్రీలపై జరిగే నేరాల సంఖ్య తగ్గదు. లేదంటే ప్రతి ఏడూ ఇలాంటి నివేదికలు వస్తుంటాయి. చర్చిస్తారు. మర్చిపోతారు. మళ్లీ కథ మొదటికే వస్తుంది. ముఖ్యంగా తెలంగాణలో స్త్రీలపై నేరాలు మరింతగా పెరిగాయి. 2020 నివేదిక ప్రకారం 17,791 నేరాలు జరగగా, 2021లో 20,865 కు పెరిగాయని నివేదిక ద్వారా తెలుస్తోంది. కాగా ఇందులో 9,468 నేరాలకు వారి భర్తలు లేదా బంధువులే కారణమని, అత్యాచార సంఘటనలో 95.5% తెలిసిన వారేననే దిగ్భ్రాంతిని కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. తెలంగాణలో జరిగే మొత్తం నేరాల్లో అధిక సంఖ్య నేరాలు ఒక్క హైదరాబాద్ నగరంలోనే నమోదు అవుతున్నాయి. అంటే ఆధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, చదువుకున్న వారు, ఉద్యోగులు, వ్యాపారులు ఎక్కువగా ఉండే మహానగరంలో స్త్రీలకు భద్రత లేదన్నమాట. మరో తెలుగు రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ విషయానికి వస్తే స్త్రీలపై జరిగే నేరాల్లో 10వ స్థానంలో ఉంది. 2020 తో పోల్చితే 2021లో 3.8% నేరాలు పెరిగాయి. అయితే నేరాలు నమోదు అయ్యి, ఛార్జ్ షీట్ ఫైల్ అయిన కేసులు 2020లో 90% ఉంటే 2021లో 93.5శాతానికి పెరిగాయి. గుడ్డిలో మెల్ల నయం అన్నట్టు కనీసం ఛార్జ్ షీట్ ఫైల్ అయితే తదుపరి దర్యాప్తు, శిక్ష పడడం లాంటి చర్యలు త్వరితగతిన పూర్తవుతాయని పరిశీలకులు అంటున్నారు. దిశ కింద నమోదైన కేసులన్నీ ఏడు రోజుల్లోపు దర్యాప్తు ముగించి, ఛార్జ్ షీట్ ఫైల్ చేయాలని నిబంధన ఉన్న కారణంగా ఇది సాధ్యమైంది. దిశ చట్టం అమల్లోకి రాకపోయినా దిశా యాప్ వాడకం పెరిగింది. దీనివల్ల కూడా నేరాలు తగ్గాయంటున్నారు.

# ఈవీఎంలపై ప్రతిసారీ అనుమానాలేనా..?



ఏ దైనా ఒక వ్యవస్థ స్థానే కొత్తదానిని ప్రవేశ పెడితే దానిని గుడ్డిగా వ్యతిరేకించకూడదు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎం)ల ను ప్రవేశపెట్టి మూడు దశాబ్దాలు దాటింది. దానిపై ఇంకా అనుమానాలను వ్యక్తం చేయడం తగదు. ఈవీఎంలలో నమోదైన ఓట్లను సరిచూసు కోవడం (క్రాస్ చెక్) కోసం ప్రవేశపెట్టిన వీవీ ప్యాట్‌ల ద్వారా వచ్చిన స్లిప్‌లను వందశాతం లెక్కిం చాలన్న అభ్యర్థనలను సుప్రీంకోర్టు తోసి పుచ్చింది. అనుమానాలతో వ్యవస్థనే కాల దన్నడం సరైనది కాదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. కౌంటింగ్ సమయం లో స్లిప్‌లను లెక్కించేందుకు ఎలక్ట్రానిక్ యంత్రా లను వినియోగించాలన్న సూచ నను ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు చేసింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టిన కొత్తలో అను మానాలు వ్యక్తం అయిన మాట నిజమే కానీ, ఇప్పటికి నాలుగు, ఐదు సార్లు వీటినే వినియో గించడం జరుగుతున్నప్పుడు ఇంకా అనుమానా లను వ్యక్తం చేయడం భావ్యం కాదన్నది సర్వో న్నత న్యాయస్థానం అభిప్రాయం. ఓటింగ్ వివ రాల కోసం ప్రవేశపెట్టిన వీవీ ప్యాట్ స్లిప్‌లను నూరు శాతం సరిచూడటం కుదరదని ధర్మా సనం స్పష్టం చేసింది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశాలు లేవని ఎన్నికల సంఘం మరోసారి స్పష్టం చేసింది. ఈవీఎంల పని తీరుపై సాంకేతిక నిపుణులచేత ఎన్నికల సంఘం గతంలో డిమాన్‌స్ట్రేషన్ చేయించింది. ఇప్పుడు మళ్ళీ చేయించింది. వారి అను మా నాలను నివృత్తి చేయడానికే వీవీ ప్యాట్ సిస్టమ్‌ని ప్రవేశపెట్టింది. ఈవీఎంల స్థానే పాత బ్యాలెట్ పద్ధతిని ప్రవేశపెట్టాలని కోరుతూ ఆమధ్య దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈవీఎంలను తొలిసారిగా 1998లో ప్రవేశ పెట్టారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ యంత్రా లను చాలాకాలంగా ఉపయో గిస్తున్నారు. వీవీ ప్యాట్ లపై అరుణ్‌కుమార్ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను పురస్కరించుకుని వంద శాతం స్లిప్‌లను వంద శాతం సరిచూడటం కుదరదని కోర్టు స్పష్టం చేస్తూనే ఎన్నికల సంఘానికి కొన్ని సూచనలు చేసింది. ఈవీఎంలలో సింబల్ లోడింగ్ పూర్తి అయిన తర్వాత ఆ యూనిట్‌ని సీల్ చేసి 45 రోజుల పాటు భద్రపర్చాలని కోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఫలితాలు వెల్లడైన తర్వాత ఏడు రోజుల లోపుగా అభ్యర్థులు తమ అభ్యంతరాలను తెలపాలనీ, అప్పుడు ఇంజనీర్ల బృందం ఈవిఎంలలో రికార్డయిన మెమరీని తనిఖీ చేయాలని కోర్టు ఆదే శించింది. ఇందు కయ్యే ఖర్చంతా అభ్యర్థులు భరించా లని కూడా ఆదేశించింది. ట్యాంప రింగ్ జరిగితే ఆ ఖర్చులు తిరిగి ఇవ్వాలనికూడా ఆదేశించింది. ప్రస్తుతం ఓ అసెంబ్లి నియోజకవర్గంలో ఐదు ఈవీఎం లలో ఓట్లను సరిచూస్తున్నారు. అలా కాకుండా మొత్తం ఈ వీఎంల లోని ఓట్లను సరిచూడాలని పిటిషనర్ కోరారు. అది సాధ్యం కాదని ఎన్నికల సంఘం స్పష్టం చేయడంతో పిటిషనర్ పిటిషన్‌ని కోర్టు తోసిపుచ్చింది. అయితే, ప్రతి పార్టీ గుర్తుతో పాటు బార్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీ లించాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశిం చింది. వివి ప్యాట్‌లపై సుప్రీంకోర్టు తీర్పు ప్రతి పక్షాలకు చెంప దెబ్బ అంటూ ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానిం చారు. అయితే, గతంలో బీజేపీ కూడా ఈవీఎంల పని తీరును వ్యతిరేకించింది. దీనిపై ఆ పార్టీ నాయకుడు ఒకరు పెద్ద పుస్తకమే రాశారు. ఈ విఎంలను ప్రాంతీయ పార్టీల కన్నా, కాంగ్రెస్,బీజేపీలే పదే పదే వ్యతి రేకిస్తున్నారు. ఈ రెండు పార్టీలు ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు మాత్రమే వ్యతిరేకిస్తున్నాయి. రాజకీ యంగా తమకు లబ్ది కలిగితే ఆ వ్యవస్థను పొగడటం, వ్యతిరేక ఫలితాలు వస్తే విమర్శించడం ప్రధాన రాజకీయ పార్టీల తీరుగా కనిపిస్తున్నది. దీని వల్ల వాస్తవం ఏమిటో తెలియక ప్రజలు అను మానాలకు గురి అవుతున్నారు. ప్రతిసారి ప్రతి పక్షంలో ఉన్న పార్టీ అనుమానాలను వ్యక్తం చేయడం ఎన్నికల సంఘం ఈ యంత్రాలను నిపుణుల చేత డిమాన్‌స్ట్రేట్ చూపించి అను మానాలు తీర్చడం జరుగుతోంది. అయినా ఎన్నికల ముందు ఇలాంటి పిటిషన్లుదాఖలు అవుతూనే ఉన్నాయి.

# విలువైనది జీవితం....!

ప్రతి మనిషి జీవితంలో చాలా చేయాలనుకుంటాడు. చివరకు ఏవో కొన్ని మాత్రమే చేయగలుగుతాడు. అది కూడా సంపూర్ణంగా చేయలేకపోవచ్చును కూడా. అందరూ అష్టావధానం చేయలేరు. అలాగని చేయలేనంత మాత్రాన వారు అసమర్థులు కారు. పట్టుదల, కృషి వుంటే సామాన్యులు కూడా అద్భుతాలు చేయగలుగుతారు. గొప్పగొప్ప శాస్త్రవేత్తలుగా ప్రపంచ ఖ్యాతి పొందినవారిలో కొందరు బాల్యంలో చదువులో అంతగా రాణించనివారే. 'మనిషై పుట్టినవాడు కారాదు మట్టిబొమ్మ/ పట్టుదలే వుంటే కాగలడు మరో బ్రహ్మ' అంటాడో సినీకవి. ఐన్‌స్టీన్‌కు మొదట్లో మాట్లాడటం కష్టంగా వుండేది. చదువులోనూ అంతగా రాణించలేకపోయేవాడు. తన 16 ఏళ్ల వయసులో స్విస్ ఫెడరల్ పాలిటెక్నిక్ స్కూల్లో జరిగిన ప్రవేశ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. ఆ తర్వాత అదే ఐన్‌స్టీన్ భౌతికశాస్త్రంలో చేసిన కృషికి గాను నోబెల్ బహుమతి అందుకున్నాడు. యాపిల్ కంప్యూటర్ సృష్టికర్త స్టీవ్‌జాబ్స్ కూడా కళాశాలలో అట్టడుగు విద్యార్థే. అంతెందుకు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ దేవుడు అంటూ నీరాజనాలు అందుకున్న సచిన్ టెండుల్కర్ చదివింది కేవలం 12వ తరగతి వరకే. తనకు ఇష్టమైన క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుని అందులో ఎదిగాడు. 'చదువు ప్రతిభను రాణింపజేసే ఒక సాధనమే కానీ, దానికి కారణమూకాదు, ఫలితమున్నూకాదు' అంటారు శ్రీపాద. చదువు ఆ వ్యక్తిలోని సృజనాత్మకతను, నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా వుండాలి. మన దేశంలో చాలా మంది తమ పిల్లలు ఇంజనీరింగ్ లేదా మెడికల్ కోర్సులో సీటు సంపాదించడం ప్రతిష్టగా భావిస్తారు. ఎలాగైనాసరే ర్యాంకులు కొట్టాలన్న పోటీ వాతావరణంలో నవతరం ఒత్తిడికి లోనవుతోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శిక్షణా సంస్థల ఒత్తిళ్లు, ఆశల భారాన్ని తట్టుకోలేని విద్యా కుసుమాలు అర్థాంతరంగా నేలరాలుతున్నాయి. గత పదేళ్లుగా తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా విద్యా ర్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. దేశంలో ప్రతి 42 నిమిషాలకు ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనికి ఒత్తిడి, ఆందోళన, డిప్రె షన్‌లే కారణం. తాజాగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆరుగురు విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది బలవంతాన ప్రాణాలు తీసుకున్నారు. ధనార్జనే లక్ష్యంగా గల కార్పొరేట్ విద్యాసంస్థలు సృష్టించే కృత్రిమ పోటీ- ర్యాంకుల వెంట పరుగు తీయించడం వంటివి అనర్థదాయకం. ఇలాంటి ధోరణులను ప్రభు త్వాలు అనుమతించరాదు. కాని పాలకులకు అటువంటి చిత్తశుద్ధి కరువవుతోంది. భారతదేశం యువ విజ్ఞాన నిధి. అత్యధిక యువ సంపద కలిగిన దేశం మనది. '2040 నాటికి మన దేశ జనాభాలో 59శాతం మంది యువతే వుంటారని' ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ వెల్లడిం చింది. 2012 నుండి, భారతదేశంలో ప్రతి సంవత్సరం విద్యార్థుల ఆత్మహత్యల కేసులు 2.3శాతం పెరుగుతున్నా యి, మనం ఎవరిని నిందించాలి? తల్లిదండ్రులనా? ప్రభుత్వాలనా? గ్లోబలైజేషన్ ఊబిలో కూరుకుపోయిన విద్యావ్యవస్థలోని కార్పొరేట్ పోటీనా? గొంతులు కోసుకునే అసలు దోషి ప్రభుత్వం అదుపులేని కార్పొరేట్ విద్యా వ్యవస్థేనన్నది నిస్సందేహం. తప్పు ఎవరిదైనా బలిపోతు న్నది మాత్రం యువశక్తి. ఈ యువశక్తిని కాపాడుకొని, దేశాభివృద్ధిలో పాలుపంచుకునేలా చేసే బాధ్యత ప్రభు త్వాలది. మార్కులు, ర్యాంకులే సర్వస్వం కాదు. అంతకంటే విలువైనది జీవితం. చదువు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి మానసిక వికాసాన్ని పెంపొందించుకోడానికి దోహద పడాలి. 'విద్యార్థులలో నేర్చుకోవాలన్న ధ్యాస రేకెత్తించ కుండా ఉపాధ్యాయుడు బోధించడానికి ప్రయత్నించడం చల్లని ఇనుముపై సమ్మెట వేయటం వంటిది' అంటారు హొరెస్‌మాన్. ఇతరులు సాధించిన విజయాన్ని చూసి అసూయ చెందడం, న్యూనతా భావానికి గురవడం కాక, ఆ విజయం నుంచి స్ఫూర్తి పొందేలా పిల్లలను తీర్చి దిద్దాలి. ఆత్మవిశ్వాసమనే ఆయుధాన్ని అందించాలి. చదువులో వెనకపడ్డామని ఏ విద్యార్థీ చింతించాల్సిన పనిలేదు. వారు చేసే కృషిలో వెనకపడకుండా వుంటే చాలు. విజయాలు వాటంతటవే స్వాగతిస్తాయి.

# కార్మికులకు కలిసొచ్చే కాలమే..!



'మూఢం' వచ్చేసింది.. పెళ్లిళ్లు, పేరంటాళ్లు, శుభకార్యాలకు అంతరాయం ఏర్పడింది. గ్రహాల స్థితి సరిగా లేని సమయాన్ని 'మూఢం' గా పండితులు పరిగణిస్తారు. గురు గ్రహం సూర్యుడికి దగ్గరగా వచ్చిన పుడు గురుమౌఢ్యంగా, శుక్రగ్రహం సూర్యగ్రహానికి దగ్గరగా వచ్చినపుడు శుక్ర మౌఢ్యంగా పిలుస్తారు. ఈ కాలాన్ని ఏవైనా పనులు ప్రారంభించడానికి అశుభంగా భావిస్తూ వాయిదా వేస్తుంటారు. ఏప్రిల్ నెల 27 నుంచి ఆగస్టు 8 వరకు 'మూఢం' ఉంటుందని పండితులు చెబుతున్నారు. కానీ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన లోక్‌సభ ఎన్నిక ఇదే సమయంలో వచ్చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా అరంగేట్రం చేసి రాజకీయ భవిష్యత్తు పరీక్షించుకునే యువ నాయకులు, గత రాజకీయ భవిష్యత్తును గణనీయంగా కోల్పోయిన అగ్రజులు, పాత పార్టీలో ఇమడలేక పార్టీలు మార్చే నేతలకు ఈ కాలం కలిసొచ్చేనా అనే సందేహాలు వేధిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆశావహ నేతలందరూ ఓట్ల కోసం తమ అభిమానులు, అనుచరులకు సంబంధించి అన్ని శుభకార్యాలకూ హాజరవుతూ వస్తున్నారు. ప్రస్తుతం 'మూఢం' రావడంతో వాటికి బ్రేక్ పడింది. ఇక మిగిలిందల్లా ఎన్నికల ప్రచారం, ఊరేగింపులు, ర్యాలీలు, బహిరంగ సభలు, తదితర జనసమ్మర్ధ కార్యక్రమాల్లోనే ఓటర్లను మూకుమ్మడిగా ప్రసన్నం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక ఓటరు మహాశయులను కలవాలంటే శుభకార్యాలకు బదులుగా పుట్టినరోజు వేడుకలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకునే ఆత్మీయ సమ్మేళనాలవంటి సందర్భాలు సృష్టించుకోవాల్సిందే. మే 13న లోక్‌సభ ఎన్నికలు, ఆ వెంటనే గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు ఎన్నికలు జరగనుండటంతో శుభకార్యాలకు అడ్డొచ్చిన 'మూఢం' కాస్తా.. కష్టం చేసుకునే కార్మికులకు కలిసొచ్చేలా ఉంది. శుభకార్యాలకు పనిచేసే వృత్తుల వారికి ఈ ఎన్నికలతో ఉపశమనం లభించనుంది. ముఖ్యంగా వివిధ పార్టీల ప్రచారం కోసం, టిఫిన్లు, భోజనాల తయారుతో పాటు విజయోత్సవాల నిర్వహణ వంటి కార్యక్రమాలకు ఎంతో మంది కూలీల అవసరం ఉంటుంది. నాయకుడు ఊరేగింపులో మేళతాళాలు వాయించే వారి నుంచి డీజే, లైటింగ్, జెండాలు పట్టే వారు, నృత్యాలు, కోలాటాలు, బ్యానర్లు కట్టే వారు, జెండాలు మోసే వారు, వంటా వార్పు, వడ్డింపులు, కూలీలు ఇలా అన్ని రంగాల్లో పని చేసే కార్మికులకు పని చూపదనుకున్న ఈ 'మూఢం' కాస్త ఎన్నికల పుణ్యమాని ఊరటనివ్వనుంది.

తిండి కల్తీ... తీపి కల్తీ... మాట కల్తీ... మనసు కల్తీ... పాలు కల్తీ... నీళ్లు కల్తీ... గాలి కల్తీ... మందు కల్తీ... విందు కల్తీ...

# కల్తీ కానిదేమున్నది...?



'కొద్దికొద్దిగా మనం కోల్పోతాం, ఆరోగ్యాన్నీ, ఆయువును, తాజా తాజాగా కనపడే ఆహార పదార్థాల మెరుపు సోయగాల వలలకు, కొద్ది కొద్దిగా మన దేహాలను విడిపోతాం' ఇది కల్తీలపై కవిత్వం పంక్తి. నిజంగా మనం కొద్ది కొద్దిగానే కోల్పోతున్నాం. ఎవ్వరమూ దీనిపై బెంగపడటం లేదు. రందీ లేదు, రాద్ధాంతమూ లేదు. మన యోగక్షేమాల కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వాలకూ దీనిపై పెద్ద పట్టింపూ లేదు. ఇంత కన్నా జాతీయ అంతర్జాతీయ, శాస్త్ర సాంకేతిక అంశాలు పెద్దవేవో వాటి కుంటాయి కదా. వాటి కోసం తలమునకలై వుంటారు వారు. పోతే వ్యక్తులుగా పోతాం. వ్యవస్థ కదా ముఖ్యం అంటారు వాళ్లు. వ్యవస్థలో మనుషులుంటారో లేదో ఆ నాయక మన్యులకే తెలియాలి మరి! మొత్తానికి కల్తీ మాత్రం మన ఆహారానికి మాత్రమే పరిమితమైపోలేదు. అది ప్రభుత్వ విధానాలకు, రాజకీయాలకు, వారి చిలక పలుకులకూ ఎగబాకి ఇక అందులోంచి బయటపడలేనంతగా విస్తరించింది. కుడితిలో పడ్డ ఎలుకలా, కల్తీలో పడ్డ మనుషులమై కొట్టుకుంటున్నాము. తిండి కల్తీ, తీపి కల్తీ, మాట కల్తీ, మనసు కల్తీ, పాలు కల్తీ, నీళ్లు కల్తీ, గాలి కల్తీ, మందు కల్తీ, విందు కల్తీ, కల్తీ కానిదేమున్నది? 'స్వచ్ఛభారత్' అని ఎంత గొప్పగా గాంధీబొమ్మను వేసి పిలుపునిచ్చామో! పాపం ఆ గాంధీని చంపినట్లే స్వచ్ఛతనూ చేశాం. స్వచ్ఛత అట్లా ఉంచండి, స్వస్థత కూడా గాలికొదిలేసాం. ప్రజల ప్రాణాలంటే ఎంత తేలికయి పోయింది! ప్రజలు బతకటం కోసం, ఆరోగ్యంగా జీవించడం కోసం, ఆహారం తీసుకుంటారు. ఇక అనారోగ్య భారిన పడితే ఔషధాలను వేసుకుంటారు. ఇవి రెండూ కల్తీగా మారిపోయాక జనం ఇంకేం చేస్తారు. కొద్దికొద్దిగా కోల్పోవడం తప్ప. యూరియా, కాస్టిక్ సోడా, కూరగాయల నూనెల వంటి హానికరమైన పదార్థాలను కలిగివున్న సింథటిక్, పాలతో పాలను కల్తీ చేసాక అల్సర్లు, క్యాన్సర్లు, కిడ్నీలు పోవడాలు తప్ప ఇంకేం జరుగుతుంది! తాజాగా కూరగాయలు కనపడేందుకు సింథటిక్ షీన్‌తో, స్ప్రేలతో, సిలికాన్‌లో, ఆక్సిటోసిన్‌తో కార్బైడ్‌లతో ముంచెత్తాక, ఆరోగ్యం కుళ్లి కంపు కొట్టదూ! సిటీ కల్చర్ మాత్రమే కాదు, ఈరోజు పట్టణాలు, ఊర్లలోకి కూడా హోటళ్లు కర్రీ పాయింట్‌లు విరివిగా వచ్చేసాయి. అందుల్లో కలర్‌ఫుల్‌గా నోరూరించే వంటకాలతో ఎన్నిరంగులు, రసాయనాలు పొట్ట నిండుతు న్నాయో! సిటీ మార్కెట్లలో కూరగాయలు చూడండి నిగనిగలాడతాయి, పండ్లు అంతే! వ్యాక్స్ లేకుండా యాపిల్ దొరుకుతుందా! క్రిమ్సన్ రంగుతో పుచ్చకాయలు ఎంత ఎరుపుతో దర్శనమిస్తాయో! ఆఖరికి కొబ్బరి బోండాలకూ, చెట్లకూ సూదిమందులిచ్చాక, మన ఆరోగ్యానికిక సూదిమందు అవసరముండదు. బియ్యానికి పాలిష్, పప్పులకు రంగు, టీపొడిలో కలిసే పొడులెన్నో.., ఇక నూనెలు రసాయన సమ్మేళనాలే కదా! జంతుచర్మాల భట్టీల దందాలనెన్ని సార్లు పట్టుకోలేదు! ఇవన్నీ మీకందరికీ తెలుసు. కానీ వీటిని అరికట్టే ప్రభుత్వ యంత్రాంగం ఏమి చేస్తున్నట్టు? ఇవన్నీ పక్కన పెడితే, ఇంకో భయంకర విషయం ఫార్మా కంపెనీలు చేస్తున్న కల్తీ. దీని గురించి పెద్దకథే రాయొచ్చు. కానీ ఒక్క కథే చెబుతాను. కోవిడ్‌కాలంలో ఉత్తరప్రదేశ్, గుజరాత్, బీహార్ ఆసుపత్రులలో కరోనా లక్షణాలతో వచ్చి చేరిన రోగులకు 'రెమిడెసివిర్' అనే కాడిలా కంపెనీ మందును ఇచ్చారు. రోగులు మరింత అస్వస్థతకు గురై చనిపోవటం జరిగింది. వైద్యులు ఫిర్యాదు చేశారు. ఇక్కడ వాడటానికి ముందే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ) వాడకూడదనీ చెప్పింది. అయినా ప్రభు త్వాలు పట్టించుకోలేదు. కనీసం మన ల్యాబ్‌ల్లో పరీక్షా చేయలేదు. ఆ ఫార్మా కంపెనీపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. కానీ కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న పార్టీ మాత్రం ఆ కంపెనీ నుంచి రూ.18 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో చందామాత్రం తీసుకున్నది. ఇదొక్కటే కాదు, అనేకమైన, ఫార్మా కంపెనీలు కల్తీ మందులతో ప్రజల ప్రాణాలకు ముప్పును తెస్తున్నాయి. వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు స్వార్థపూరితంగా నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నది వాస్తవంగా కనపడుతున్న సత్యం. అంటే ఎన్నికల బాండ్లు కేవలం ఎన్నికలకు సంబంధించినవే కాదు. అవి మన జీవితాలకూ, ప్రాణాలకూ సంబంధమున్న వని గుర్తించాలి. ఇక మన ప్రభుత్వాల అలసత్వానికి నిదర్శనంగా అంతర్జాతీయ కంపెనీలూ దేశప్రజల ఆరోగ్యాన్ని గంగలో కలుపుతున్నాయి. పసిపిల్లల ఆహార పదార్థాలను, సిర్‌లాక్ మొదలైనవి తయారు చేసే నెస్లే కంపెనీ, మన లాంటి పేద, మధ్య తరగతి దేశాల పిల్లలకు అమ్మే ఉత్పత్తుల్లో కృత్రిమ తీపిని కలిపి (యాడెడ్ సుగర్) సరఫరా చేస్తోంది. ఇది పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. విపక్షతేమంటే, యూరప్‌కు అమ్మే ఉత్పత్తిలో యాడెడ్ సుగర్‌ను జోడించడం లేదు. మరి ప్రభుత్వం భావితరాల ఆరోగ్యాల్ని గాలికొదిలేసిందా! ఎవరు అడ్డుకట్ట వేయాలి? పాలకులకు బాధ్యత లేదా? ప్రజల ఆరోగ్యం కోసం ప్రజలే ప్రశ్నించాలి. ప్రభుత్వాలను నిలదీయాలి.

## భర్తల కోసం భార్యలు... భార్యల కోసం భర్తల

(1వ పేజీ తరువాయి)


కోసం.. మేథావులను కలుస్తున్నారు. విద్యావంతులతో భేటీ అవుతున్నారు. సైలెంట్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్‌పై బరిలో ఉన్న వేమిరెడ్డి ప్రశాంతి కోసం.. ఆమె భర్త, నెల్లూరు ఎంపీ స్థానం నుంచి టీడీపీ తరఫున బరిలో ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తన గెలుపు కన్నా.. తన భార్య కోసం ఆయన చెమటోడుస్తున్నారు. వారానికి మూడు రోజులు కోవూరులోనే ఆయన ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ఫైర్‌బ్రాండ్ నాయకురాలు, మంత్రి రోజా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గం నుంచి వరుసగా మూడో సారి పోటీ చేస్తున్నారు. టీడీపీ తరఫున ఉన్న గాలి కుటుంబంపై ఈమె పోరాడుతున్నారు. గతంలో రెండు సార్లు విజయందక్కించుకున్నారు. అయితే.. ఇప్పుడు ఫైట్ టఫ్ అని తేలడంతో భర్త సెల్వమణి రంగంలోకి దిగారు. మీడియా మీటింగులు.. మేధావి వర్గాలను అక్కున చేర్చుకుంటున్నారు. ఎలాగూ దర్శకుడు కావడంతో షార్ట్ ఫిల్మ్‌లు తీసి.. సోషల్ మీడియాలో రోజాకు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు తమిళనాడు బోర్డర్ మండలాల్లో స్వయంగా పర్యటిస్తున్నారు. ఎండ కూడా లెక్కచేయకుండా.. దూసుకుపోతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి.. నారా భువనేశ్వరి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కోసం శ్రమి స్తున్నారు. ఇదేసమయంలో కుప్పం నియోజకవర్గంలో ఆమె తన భర్త గెలుపు కోసం.. ఇంటింటి ప్రచారానికీ.. శ్రీకారం చుట్టారు. తన భర్త చంద్రబాబును గెలిపించాలని.. ఇక్కడ అభివృద్ధి బాధ్యతను తానే తీసుకుంటానని కూడా ఆమె ప్రకటించారు. నటసింహం నందమూరి బాలయ్య పోటీ చేస్తున్న హిందూపురం నుంచి ఆమె ప్రచారం జోరెత్తిస్తున్నారు. భర్త గెలుపు కోసం.. ఎన్నడూ ఎరుగని పేదల ఇళ్లకు గుడిసెలకు కూడా వెళ్లి.. వారి ఇళ్లలో పరిస్థితిని తెలుసుకుంటున్నారు. వారికి భరోసా ఇస్తున్నారు. మండు టెండలోనూ రోడ్లపై మెరుస్తున్నారు. నారా లోకేష్ కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆయన భార్య. ఉన్నత విద్యను చదివిన ఆమె ఇప్పుడు.. నేలకు దిగి వచ్చారు. మంగళగిరిలో పొలాల్లోకి వెళ్లి.. కూలీగా మారారు.నేతన్నల ఇంటి గడప తొక్కి.. వారి కష్టాలు తెలుసుకున్నారు. గడపగడపకు వెళ్తూ.. ప్రజలను ఓట్లు అర్థిస్తున్నారు. భర్త నారా లోకేష్ గెలుపు కోసం.. ఎంతో శ్రమిస్తున్నారు. విజయవాడ ఈస్ట్ నుంచి బరిలో ఉన్న టీడీపీ నాయకుడు.. గద్దె రామ్మోహన్ గెలుపు కోసం.. ఆయన సతీమణి అనురాధ.. అలుపెరుగని కృషి చేస్తున్నారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ కూడా కావడంతో ఆమె.. నిరంతరం.. ప్రజల్లోనే ఉంటున్నారు. గద్దెకు ఓటేయాలని పిలుపునిస్తున్నారు. మహిళా సంఘాలతోనూ మమేకం అవుతున్నారు.

## కోవీషీల్డ్ నుంచి భయంకరమైన వాస్తవం..!



భారత్‌లో కొవాక్సిన్, కొవిషీల్డ్, స్పుత్నిక్-వి టీకాలు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా కొవాక్సిన్, కొవిషీల్డ్ సేకరించి ప్రజలకు ఉచితంగా వేసింది. అటు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా వీటిని నేరుగా ఉత్పత్తిదారుల నుంచి సేకరించి నామమాత్రపు ధరకు అందించాయి. దేశంలో దాదాపు 85 శాతం మంది కొవాక్సిన్ లేదా కొవీషీల్డ్ మాత్రమే తీసుకున్నారు. వీటిలో ఇప్పుడు కోవీషీల్డ్ నుంచి భయంకరమైన వాస్తవం ఒకటి బయటపడింది. తమ కంపెనీ తయారుచేసిన కొవీషీల్డ్ వ్యాక్సిన్, సైడ్ ఎఫెక్టులు కలిగిస్తుందని ఆస్ట్రాజెనికా కంపెనీ తొలిసారి అంగీకరించింది. కొవీషీల్డ్ తీసుకున్నవాళ్లలో కొంతమందికి రక్తం గడ్డకడుతుందని, మరికొందరికి తెల్ల రక్తకణాలు (ప్లేట్ లెట్స్) సంస్థ గణనీయంగా తగ్గిపోతుందని తెలిపింది సదరు కంపెనీ. దీంతో దేశవ్యాప్తంగా ఆ వ్యాక్సిన్ తీసుకున్నవాళ్ల వెన్నులో వణుకు మొదలైంది. అయితే ఈ సైడ్ ఎఫెక్ట్లు చాలా అరుదుగా మాత్రమే జరుగుతుందని తెలిపిన కంపెనీ, లక్ష మందిలో ఎంతమందిపై ఈ దుష్ప్రభావం చూపుతందనే లెక్కల్ని మాత్రం వెల్లడించలేదు. కొవీషీల్డ్ వ్యాక్సిన్ వల్ల తాము ఎక్కువ సైడ్ ఎఫెక్టుల బారిన పడ్డామంటూ బ్రిటన్ లో పలువురు కోర్టుకెక్కారు. ఈ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగా ఆస్ట్రాజెనికా కంపెనీ ఈ భయంకరమైన వాస్తవాన్ని బయటపెట్టింది. కొవీషీల్డ్ తీసుకోవడం వల్ల తాము తీవ్ర దుష్ప్రభావాలకు లోనైనట్టు బ్రిటన్ కు చెందిన 51 మంది కోర్టులో కేసులు వేశారు. వీళ్లలో మొదట కేసు వేసిన వ్యక్తి జెమీ స్కాట్. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల తను శాశ్వత మెదడు వాపు వ్యాధికి గురైనట్టు అతడు పేర్కొన్నాడు. దీనికి సంబంధించిన విచారణలో భాగంగా కోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లలో, ఆస్ట్రాజెనికా సంస్థ పై విధంగా స్పందించింది. రేర్ కండిషన్స్‌లో తమ వ్యాక్సిన్ వల్ల శరీరంలో రక్తం గడ్డ కడుతుందని తెలిపింది. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీతో కలిసి ఈ వ్యాక్సిన్ తయారుచేసింది ఆస్ట్రాజనికా. ఈ వ్యాక్సిన్‌కు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ అనుమతినిచ్చింది. దీంతో సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా, ఆస్ట్రాజనికాతో కలిసి భారీమొత్తంలో భారత్ లో కొవీషీల్డ్ ను ఉత్పత్తి చేసింది. ఆ వెంటనే కోట్లాది మందికి ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం అందించింది.

# కోరల్లేని పులి 'నోటా'... ఓటును గెలిపిస్తుందా...!




నోటా ఎన్నికలలో సాధారణ ప్రజల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచుతుంది. ఈ ఆప్షన్‌తో ఓటరు తన అయిష్టాన్ని వ్యక్తం చేయడానికి ఆస్కారం ఉంది. తద్వారా తాము నిలబెట్టిన అభ్యర్థులను ప్రజలు అంగీకరించరని, మంచి అభ్య ర్థులను నిలబెట్టాలని పార్టీలకు సందేశం కూడా పంపినట్టవుతుంది. నోటా లేని కాలంలో ఓటరు ఏ అభ్యర్థినీ ఇష్ట పడకపోతే.. ఓటు వేయడానికి ముందుకొచ్చేవాడు కాదు. దీంతో ఆ ఓటు వృథా అయ్యేది. జాస్వామ్యంలో పౌరులు పెద్ద సంఖ్యలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం అవసరం. ఇది సజీవ ప్రజాస్వామ్యానికి ప్రతీక. అయితే ఓటర్లు ఏ అభ్యర్థినీ అర్హులుగా గుర్తించకపోతే? దీన్ని దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల సంఘం ఒక వ్యవస్థను అభివృద్ధి చేసింది. దీని ద్వారా ఎంత శాతం మంది ప్రజలు ఎవరికీ ఓటు వేయడం సరికాదని భావించే ఈ ప్రక్రియకు కమిషన్ 'నోటా' అని పేరు పెట్టింది. ప్రజలు ఎన్నుకున్న నేతలే పాలకులుగా మారే పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత కీలకం. కాలానుగుణంగా ఈ ఎన్నికల ప్రక్రియలో మార్పులు, సంస్కరణలు చోటు చేసుకుంటున్నాయి. వివిధ రాజకీయ పార్టీల తరఫున పోటీలో నిలిచే అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ పడుతూ ఉంటారు. వారిలో ఓటర్లు తమకు నచ్చినవారికి ఓటేయడం.. అలా ఎక్కువ ఓట్లు వచ్చిన వారిని విజేతగా ప్రకటించడం చూస్తూనే ఉన్నాం. సాధారణంగా ప్రజాస్వామ్యం అంటే మెజారిటీ అభిప్రాయం ప్రకారమే నడచుకోవాలని అర్థం. కానీ ఈ ప్రక్రియలోనూ తరచి చూస్తే లోపాలు కనిపిస్తాయి. ఉదాహరణకు 100 ఓట్లు ఉన్న ఓ నియోజక వర్గంలో నాలుగైదు పార్టీలు, ఒకరిద్దరు స్వతంత్రులు పోటీ చేశారని అనుకుందాం. వారిలో ఒక అభ్యర్థికి 25 ఓట్లు, మిగతా అభ్యర్థులు, స్వతంత్రులకు 20 ఓట్ల కంటే తక్కువ వచ్చాయని అనుకుందాం. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం 25 ఓట్లు పొందిన అభ్యర్థి గెలిచినట్టు లెక్క. కానీ నిజానికి ఆ అభ్యర్థిని వద్దు అనుకున్న ఓటర్లు 75 మంది ఉన్నారు. అందుకే వారు తమకు నచ్చిన ఇతర అభ్యర్థికి ఓటేశారు. కానీ ఓటర్లు నిరాకరించడం అనేది లెక్కలోకి రావడం లేదు. కాబట్టి మెజారిటీ ప్రజలు అంగీకరించకపోయినా సరే ఈ ఎన్నికల ప్రక్రియలో గెలుపొందే అవకాశం ఉంది. అయితే ఒక్కోసారి పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ ఓటరుకు నచ్చలేదంటే..తన వ్యతిరేకతను తెలియజేయడానికి ఒకటే మార్గం ఉండేది. అది పూర్తిగా ఎన్నికలను బహిష్కరచడమే. సాధారణ పరిస్థితుల్లోనే 100 ఓట్లకు పోలవుతున్నది గరిష్ఠంగా 70 శాతం కూడా ఉండడం లేదు. పట్టణ ప్రాంతాల్లో 50 శాతం ఓట్లు పోలైతే గొప్ప విషయంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థులు నచ్చలేదని ఓటేయడం మానేస్తే.. ఆ ఎన్నికలకు అర్థమే లేకుండా పోతుంది. అందుకే అభ్యర్థులు నచ్చకపోయినా సరే.. ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకుంటూ తన అభిప్రాయాన్ని తెలియజేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సరికొత్త అవకాశవే నోటా (NOTA). None Of The Above కు సంక్షిప్త రూపమే NOTA. అంటే పైనున్న అభ్యర్థులెవరూ కాదు అని దాని అర్థం. అభ్యర్థుల పేర్లతో పాటు నోటా కూడా ఒక గుర్తును కలిగి, ఇవిఎంలో అన్నింటి కంటే చివరను ఉంటుంది. అభ్యర్థుల జాబితాలో ఏ ఒక్కరూ నచ్చలేదు అనుకున్నప్పుడు ఓటరు ఈ నోటాకు ఓటు వేయవచ్చు. సిఇసి నోటాను అందుబాటులో తేవడం వరకు ఓకే. అభ్యర్థుల గుణగణాలు పరిశీలించి..ఎవరూ నచ్చలేదని నిర్ణయించుకుని ఓటేసే ప్రజలు 100 మందిలో ఒకరిద్దరు ఉంటే ఎక్కువ. అటూ ఇటూగా సగటున 1 శాతం లోపే ఈ గుర్తుకు ఓట్లు పోలవుతుంటాయి. ఈ మధ్యన 2023 ఏడాది చివరిలో జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో చత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 1.5 శాతం ఓట్లు నోటాకు వచ్చాయని గణాంకాలు చెబుతున్నాయి. తద్వారా ఆ మేరకు ఓటర్లు తమ నిరసన వ్యక్తం చేసినట్టు రికార్డవుతోంది. కానీ ఒకవేళ పోటీలో ఉన్న అభ్యర్థులందరి కంటే ఎక్కువ ఓట్లు నోటా సాధిస్తే ఏమవుతుంది? ఇదే ప్రశ్న ఓటు వేయడానికి వెళ్లే చాలామంది మదిలో మెదులుతూ ఉంటుంది. చట్టసభలకు (అసెంబ్లీ, లోక్‌సభ) జరిగే ఎన్నికల్లో ఒకవేళ ఎక్కడైనా నోటాకు అత్యధిక ఓట్లు పడ్డాయంటే.. అక్కడ ద్వితీయ స్థానంలో నిలిచిన అభ్యర్థి గెలిచినట్టుగా ప్రకటిస్తారు. అంటే మెజారిటీ ప్రజలు అభ్యర్థులను తిరస్కరించినా సరే.. వారి తిరస్కరణకు ఫలితం లేకుండా పోతోంది. ఇదే అంశంపై సుప్రీం కోర్టులోనూ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలు దాఖలయ్యాయి. హోరాహోరీగా వాదనలు జరిగాయి. తమ అభిప్రాయం చెప్పాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ సందర్భంగా జరిగిన వాదనల్లో పిటిషనర్లు కొన్ని సూచనలు చేశారు. ఓటర్ల తిరస్కరణను కచ్చితంగా గుర్తించాలని, ఎక్కడైనా నోటా అత్యధిక ఓట్లు సాధిస్తే.. అక్కడ ఎన్నికలను రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని, రద్దయిన ఎన్నికల్లోని అభ్యర్థులు మళ్లీ పోటీ చేయడానికి వీల్లేకుండా నిబంధనలు పెట్టాలని సూచించారు. రెండోసారి కూడా నోటాకే ఎక్కువ ఓట్లు వస్తే అన్న ప్రశ్న తలెత్తింది. ఓటర్లను ప్రభావితం చేయగల సంస్థలు ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిస్తే పదేపదే నోటాకే ఓట్లు వేయించే అవకాశం కూడా ఉంటుందని, మొత్తంగా ఎన్నికల ప్రక్రియ అపహాస్యం అవుతుందన్న చర్చ కూడా జరిగింది. సర్వోన్నత న్యాయస్థానంలో కేసుల సంగతి ఇలా ఉంటే.. ఇప్పటికీ నోటా అంటే 'కోరల్లేని పులి' మాదిరిగానే మిగిలి పోయింది.

## ఏపీలో కూటమి మ్యానిఫెస్టో విడుదల

(1వ పేజీ తరువాయి)

క చట్టం తెస్తామని కూటమి నేతలు తెలిపారు. అలాగే మత్స్యకారులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. బోట్ల మరమ్మత్తులకు ప్రత్యేక సాయం చేస్తామన్నారు. ఆర్యవైశ్య కార్పోరేషన్‌కు నిధుల కేటాయింపు, చిరువ్యాపారులకు వడ్డీ లేని రుణాలిస్తామన్నారు. ఎయిడెడ్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్ మెంట్ పునరుద్ధరిస్తామని మరో హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వివాదాస్పదంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేస్తామని ఎన్డీయే మ్యానిఫెస్టోలో మరో హామీ ఇచ్చారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ లకు రూ.10 లక్షల రాయితీ కల్పిస్తామన్నారు. చేనేత పరిశ్రమలో పవర్ లూమ్స్ కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామన్నారు. ఆదరణ పథకం కింద రూ.5 వేల కోట్లు కేటాయిస్తామన్నారు. ఎన్డీయే తెచ్చిన 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లను రాష్ట్రంలో అమలు చేస్తామని కూడా కూటమి హామీ ఇచ్చింది. రాజధానిగా అమరావతి కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. బీసీలకు 50 ఏళ్లకే రూ.4 వేల పెన్షన్, బీసీ సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. బీసీల స్వయం ఉపాధి కోసం ఏటా రూ.10 వేల కోట్లు ఖర్చు పెడతామన్నారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకూ వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారు. అలాగే మెగా డీఎస్సీపై తొలి సంతకం పెడతామని చంద్రబాబు తెలిపారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్లు, వడ్డెర్లకు క్వారీల్లో 15 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారు. వైసీపీ హయాంలో దారుణ హత్యకు గురైన చంద్రయ్య, జెల్లయ్య యాదవ్, అమర్నాథ్ గౌడ్ కేసుల్ని రీఓపెన్ చేస్తామని, ఎవర్నీ వదిలి పెట్టబోమని హామీ ఇచ్చారు. అలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.2 వేల గౌరవ వేతనం ఇస్తామన్నారు. స్వర్ణకారుల అభివృద్ధికి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగస్తుల ఆత్మ గౌరవం పెంచేలా నిర్ణయాలుంటాయని చంద్రబాబు ప్రకటించారు. ప్రతి నెలా జీతాలు ఇచ్చే పరిస్థితి తీసుకొస్తామన్నారు. సీపీఎస్ విధానం ఎలా చేస్తే బాగుంటుందో చేస్తామన్నారు. కాపు మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇస్తామన్నారు. దామాషా పద్ధతిన కాపులకు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పట్టాలు పొందిన వారికి ఇళ్లు కట్టిస్తామన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ తో పాటు ఇతర కార్యక్రమాలు అమలుకు హామీ ఇచ్చారు. మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్లు అమలు చేస్తామన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా, పోలవరం సహా ఇతర ప్రాజెక్టులు పూర్తి చేస్తామని కూడా కూటమి హామీ ఇచ్చింది. డ్రైవర్లకు 15 వెలు ఏటా ఆర్థిక సాయం, చంద్రన్న భీమా మళ్ళీ అమలు, ప్రతి కుటుంబానికి 25 లక్షల హెల్త్ ఇన్స్యూరెన్స్, ప్రతి మండలంలో జనరిక్ మెడికల్ షాప్ ల ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు నియంత్రిస్తామన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో పెరగనున్న ఎండ తీవ్రత, వడగాల్పులు..





రోజు రోజుకీ భానుడు భగభగ మండుతున్నాడు. తెలుగు రాష్ట్రాలు నిప్పులకొలిమిని తలపిస్తున్నాయి. ఎన్నడూ లేనంతగా రికార్డ్ స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదౌతున్నాయి. ఇప్పటికే 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు మరో 4 రోజుల్లో 49కి చేరొచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నెలాఖరు వరకు జాగ్రత్తగా ఉండాలని వైద్యశాఖలు కూడా హెచ్చరించాయి. ఎల్ నినో ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రోజుకో రికార్డు సృష్టిస్తున్నాయి. భానుడు నిప్పులు చెరుగుతుండటంతో ఎండ తీవ్రత మరింత పెరిగింది. తెలంగాణలో పలుచోట్ల 46 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్ 30వ తేదీ ఉష్ణోగ్రతల్లో పదేళ్ల కాలంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే 4 రోజుల్లో ఎండ తీవ్రత కొనసాగుతుందని, వడగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా పిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు బయటకు వెళ్లొద్దని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. మంచినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండుతున్నాయి. వేడి, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఈ నెలలో 48 నుండి 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వడగాల్పుల కారణంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఇళ్లలోంచి బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

# ఇంట్లో ఈగల మోత - బయట పల్లకీ మోత..!



శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, మీడియాలు ప్రజాస్వామ్య పరిరక్షణకుఉన్న ప్రధాన నాలుగు స్తంభాలు. ఈ నాలుగు స్తంభాలలో ఉన్న మీడియా ప్రజాస్వామ్య పరిరక్షణలో అత్యంత ప్రధానమైన భూమిక పోషిస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. అంతటి ప్రాధాన్యత కలిగిన మీడియా రంగంలో పని చేసే జర్నలిస్టుల జీవనాలు ప్రస్తుతం ఇంట్లో ఈగల మోత -బయట పల్లకీ మోతగా ఉంది. దేశంలో ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని మీడియా సంస్థలలో పని చేస్తున్న వివిధ వర్గాల వారు అనుభవిస్తున్న కష్టాలు వర్ణనాతీతం. మీడియా సంస్థలలో వివిధ హొదాల్లో పని చేస్తున్నవారు తమ ఆరోగ్యాలు సైతం లెక్కచేయకుండా రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు తమ జీవితాలు అర్పిస్తున్నారు. కానీ మీడియా సంస్థలలో పని చేస్తున్న వారిలో 90% పైగా దుర్లభమైన జీవితాన్ని అనుభవిస్తుండడం దురదృష్టకరం. చాలీచాలని జీతాలతో, పిల్లలను సరైన చదువులు చదివించుకోలేక, స్వంత ఇళ్ళు లేక, ఇంటి బాడుగలు కట్ట లేక, అకస్మాత్తుగా తీవ్రమైన అనారోగ్యం చేస్తే తగిన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక, ఉద్యోగ రక్షణ లేక అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. అదే విధంగా జర్నలిస్టులు అకాల మరణం చెందుతుండడంతోవారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జర్నలిస్టు సమస్యలను పరిష్కరించమని అనేక సంవత్సరాలుగా జర్నలిస్టు యూనియన్లు అన్నీ రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాయి. అయినా అనేక సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలపై మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయి పదేళ్లు గడిచినా... ఇప్పటికీ జర్నలిస్టులకు ఇళ్ళ నివేశ స్థలాలు మంజూరు చేయక పోవడం శోచనీయం. అటు తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడితే ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు తీరుతాయని జర్నలిస్టులు అనేక ఆశలు పెట్టుకొని ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కానీ తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడిన కొద్ది రోజులకే జర్నలిస్టుల ఆశలు అడియాశలు అయ్యాయి. ఇంకా చెప్పాలంటే గత పది సంవత్సరాలుగా కొత్తగా ఏర్పడిన ఈ రెండు తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు ఒక విధంగా నిరాదరణకు గురి అయ్యారనే చెప్పాలి. 2014లో నూతనంగా ఏర్పడిన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన కె. చంద్రశేఖర్ రావు జర్నలిస్టులకు అనేక హామీలు ఇచ్చారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా లాంటి వివిధ రకాల మాధ్యమాలలో జర్నలిస్టుగా, డెస్క్‌లో పని చేస్తున్న వారితో పాటు ఫోటో గ్రాఫర్, వీడియో షూటర్ లాంటి వివిధ హొదాలలో పని చేస్తున్న అర్హులైనందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని, రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ట్రిబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తామని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు కొని జర్నలిస్టులు అందరికీ ఇళ్ళు వచ్చేటట్లు జర్నలిస్టు కాలనీలు నిర్మిస్తామని, ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు అందచేసి వారికి అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందే విధంగా చర్యలు తీసుకుంటామని, ప్రతి సంవత్సరం రూ. 100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని గత సిఎం కె. చంద్రశేఖర్ రావు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలలో ముఖ్యమైనవి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా విడిపోయిన తరువాత జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించడంలో శూన్యమనే చెప్పక తప్పదు. నేతల ఆశలు అడియాశలుగానే మారిపోయనుటలో సందేహం లేదు. అంతే కాకుండా అనేక ప్రధానమైన కార్పొరేట్ ఆసుపత్రుల్లో జర్నలిస్టుల హెల్త్ కార్డులను ఆమోదించే పరిస్థితి నేటికీ లేదు. దాంతో కిడ్నీ, లివర్, గుండె, బ్రైన్ లాంటి సున్నితమైన జబ్బులకు అన్ని సౌకర్యాలు కలిగిన నాణ్యమైన వైద్యం చేయించుకోలేక జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రెస్ అకాడెమీ ద్వారా జర్నలిస్టుల సంక్షేమ నిధి సంవత్సరానికి కేవలం రూ. 20 కోట్ల కేటాయించడంతో అనేక ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులందరికీ తగిన ఆర్థిక సహాయం అందడం లేదు. మీడియా రంగంలో పని చేసే అందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ళు యుద్ధ ప్రాతిపదికన ఇవ్వడం, సంవత్సరానికి రూ. 500 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయడం, సుదీర్ఘ కాలం బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన పాత్రికేయులకు ప్రభుత్వ పరంగా తగిన పెన్షన్ ఇవ్వడం, అక్రిడిటేషన్ కలిగిన పాత్రికేయుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో ఫీజుల రాయితీ కల్పించడం వంటి అనేక జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించి, అటు తెలంగాణా ప్రభుత్వం ఇటు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడబోయే నూతన ప్రభుత్వం పేద జల్నలిస్టుల కుటుంబాల్లో వెలుగులు నింపుతారని ఆశిద్దాం..!

# హస్తిన పెద్దలకు సిరాచుక్కతో బుద్ధి చెప్పాలనుకుంటున్న రైతన్న..!



2014లో అధికారంలోకి రావడానికి ముందు నరేంద్ర మోదీ రైతులపై ఎన్నో హామీలు కురిపించారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పింఛన్ మంజూరు చేస్తామన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధరను (ఎమ్మెస్పీ) నిర్ణయించి ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వమే సేకరిస్తుందని వాగ్దానం చేశారు. 200 పనిదినాలు, వ్యవసాయ కూలీలకు అధిక వేతనాలు, పంటలకు బీమా, ప్రతీ పొలానికీ నీరు, ఉచితంగా విత్తనాలు, ఎరువుల పంపిణీ ఇలా.. ఎన్నోన్నో హామీలు కురిపించారు. ఇవన్నీ నమ్మి ప్రజలు బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారు. అయితే, పదేండ్లు గడిచినప్పటికీ ఇచ్చిన ఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదు. మోదీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తీసుకొచ్చిన పంటల బీమా పథకం 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' అన్నదాతలను ఎంతవరకు ఆదుకొన్నదన్న మాట అటుంచితే కార్పొరేట్ కంపెనీలకు మాత్రం కల్పవృక్షంగా మారింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. 2016-20 వరకు ఇన్సూరెన్స్ కంపెనీలకు రూ.2,415.88 కోట్లను బీమా రుసుం కింద రైతులు చెల్లిస్తే, బీమా కంపెనీలు మాత్రం రైతులకు క్లెయిమ్‌ల రూపంలో చెల్లించిన మొత్తం రూ.1,871.54 కోట్లు మాత్రమే. ఈ లెక్కన కంపెనీలు రూ.544.34 కోట్లు లాభపడ్డాయి. మోదీ సర్కార్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్న మరో పథకం 'హర్ ఖేత్ కో పానీ'. ఏటా ఈ పథకంపై రూ.10 వేల కోట్ల ఖర్చు చేస్తామంటూ ప్రకటించిన మోదీ ప్రభుత్వం.. మొత్తంగా పదేండ్లలో లక్ష కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా రూ.30 వేల కోట్లు కూడా వ్యయం చేయలేదని గణాంకాలు చెప్తున్నాయి. ఉపాధి హామీ పథకానికి కూడా బడ్జెట్ కేటాయింపుల్లో 33 శాతం వరకూ కోత పెట్టారు. వెరసి మన్నులో బంగారు పంటలను పండించే రైతన్న అప్పుల బాధలు భరించలేక, పెరిగిన ఖర్చులతో కుటుంబాన్ని పోషించలేక అదే మన్నులో కలిసి పోతున్నాడు. పదేండ్ల బీజేపీ సర్కార్ హయాంలో వ్యవసాయరంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని వ్యవసాయరంగ నిపుణులు, మేధావులు చెప్తున్నారు. ఆదాయం లేక, అప్పుల బాధలు భరించలేక 2014 నుంచి 2023 వరకు దాదాపు లక్షా 12 వేల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకొన్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే దేశంలో రోజుకు సగటున 31 మంది రైతులు ఎక్కడో చోట అసువులు బాస్తూనే ఉన్నారు. ఇక ఇదే కాలంలో రోజువారీ కూలీల ఆత్మహత్యల సంఖ్య మరో 3,12,214గా ఉన్నది. వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోవడమే ఈ ఆత్మహత్యలకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఓ నివేదిక అంచనా ప్రకారం ఒక్కో రైతు కుటుంబంపై సగటున రూ.74,121 అప్పు ఉన్నట్టు తెలుస్తున్నది. 2013తో పోలిస్తే రైతుల అప్పు ప్రస్తుతం 57 శాతం పెరిగినట్టు సమాచారం. బీజేపీ సర్కారుపై రైతన్న ఎన్నడూ లేనంత అసహనంతో ఉన్నాడు. ఇది నిజం. పంజాబ్, హర్యానాల్లో ఓట్లడగటానికి గ్రామాల్లోకి వెళ్లిన బీజేపీ నేతలను రైతులు పొలిమేరల దాకా వెంటాడి తరమడమే దీనికి రుజువు. ఎమ్మెస్పీపై నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తున్న కేంద్రంపై మొన్నటికి మొన్న సమరశంఖం పూరించిన అన్నదాతలు.. ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళనలనూ ఉధృతం చేశారు. రెండు మూడు రోజుల కిందటే తమిళనాడుకు చెందిన దాదాపు 200 మంది రైతులు ఎముకలు, పుర్రెలతో జంతర్‌మంతర్ దగ్గర నిరసనలకు దిగడం అంతర్జాతీయ మీడియాలోనూ ప్రధానాంశమైంది. ఆ పుర్రెలు ఎవరివో కాదు, కేంద్ర అసమర్థ విధానాలు, అబద్ధపు హామీలను నమ్మి అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడిన వందలాది అన్నదాతలవే. భూమి నుంచి బువ్వను పుట్టించే రైతన్నకు ఇది తెలియంది కాదు. అందుకే, రెండుసార్లు నమ్మి మోసపోయిన అన్నదాత.. ఈ ఎన్నికల్లో మోసం చేసిన వారిని ఎలా దెబ్బకొట్టాలో దృఢంగా నిర్ణయించుకున్నాడు. అవును, రెండున్నరేండ్ల కిందట క్షమాపణలు చెప్తే శాంతించి మన్నించిన అన్నదాత, ఇప్పుడు హస్తిన పెద్దలకు సిరాచుక్కతో బుద్ధి చెప్పాలనుకొంటున్నాడు. తొలి రెండు దఫాల పోలింగ్‌లో అది స్పష్టంగా కనిపించింది కూడా.

# క్లారిటీ మిస్ అయిన రాజధాని రాజకీయం ..!

ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అంశం ఇంకా ఎటూ తేలలేదు. తాము మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామని ప్రభుత్వ పెద్దలు అంటున్నారు. మంత్రులు అదే విధంగా ప్రకటనలు చేస్తున్నారు. మేము రాజధాని కోసం భూములను త్యాగం చేశాము. అమరావతిలోనే రాజధాని ఉండాలని రైతులు అంటున్నారు. ఏపికి రాజధాని ఒకటే ఉండాలి. సీఆర్డీఏ చట్టం ప్రకారం రాజధాని అభివృద్ధి పనులు చేయాలని హైకోర్టు ఇంతకు ముందే చెప్పింది. కానీ ప్రభుత్వం మాత్రం రేపటి నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో మూడు రాజధానుల బిల్లు పెట్టి తీరతామని చెబుతోంది. మంత్రులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. కోర్టు మాట ప్రభుత్వం వినడం లేదు. దీంతో ప్రజల్లో ఒక గందరగోళం, కన్ఫ్యూజన్ నెలకొంది. ప్రభుత్వం చేస్తున్నది కోర్టు దిక్కర అవుతుందా లేదా సందేహం సామాన్యుల్లో కలుగుతోంది. ఈ ఏడాది మార్చి 4న హైకోర్టు అమరావతికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా రైతులు మహాపాదయాత్ర ఎందుకు చేస్తున్నారు.. కోర్టు చెప్పిన తర్వాత కూడా అమరావతి రైతులు ఉద్యమాన్ని ఎందుకు కొనసాగిస్తున్నారు అని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని హైకోర్టు చెప్పినా ప్రభుత్వం మూడు రాజధానుల పాట ఎందుకు పాడుతోంది..కోర్టు చెప్పిన మాట ఎందుకు ప్రభుత్వం వినడం లేదు అన్న అనుమానాలు కూడా ప్రజల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రాజధాని మార్చే అధికారం లేదు. ఆరు నెలల్లో అమరావతిలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. రాష్ట్ర అసెంబ్లీకి హైకోర్టును విభజించే అధికారం లేదని స్పష్టం చేసింది. రాజధానుల మార్పు విషయంలో అధికారం కేంద్రానికి ఉంటుందని, ఒక వేళ మార్పులు చేయాలని భావిస్తే కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అమరావతి రైతులు దాఖలు చేసిన పిటిషన్ల పై విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పును ఇచ్చింది. అయితే ఇంత స్పష్టంగా హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా అమరావతి ప్రాంత రైతులు ఆందోళనలు కొనసాగించడం, పాదయాత్రలు చేయడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. హైకోర్టు రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలని తీర్పు ఇచ్చిందే కానీ రైతులు ఆందోళన చేయవద్దు అని గానీ, పాదయాత్రలు చేయవద్దని కానీ తీర్పులో పేర్కొనలేదు. హైకోర్టు చెప్పినా కూడా మూడు రాజధానులు ఏర్పాటు చేసి తీరుతామని ప్రభుత్వం చెబుతుండటంతో రైతులు ఆందోళన కొనసాగిస్తున్నారు. పాదయాత్ర చేస్తున్నారు. అమరావతికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన హైకోర్టే .. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న పాదయాత్రకు ఎలా అనుమతి ఇస్తుంది. ఈ పిటిషన్ వేసిన సమయంలోనే తాము అమరావతినే రాజధానిగా కొనసాగించాలని ప్రభుత్వానికి ఆదేశించాము కదా ఇక పాదయాత్ర చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించవచ్చు కదా అన్న లాజికల్ డౌట్ కూడా కొందరిలో ఉంది. అయితే రాజధాని పిటిషన్ వేరు. రైతులు దాఖలు చేసిన పిటిషన్ వేరు. పిటిషన్ల అధారంగానే ఇరుపక్షాల వాదోపవాదాలు విని హైకోర్టు ఆదేశాలు ఇస్తుంటుంది. ఆ నేపథ్యంలోనే రైతులు పాదయాత్ర కోసం దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపి అనుమతి ఉత్తర్వులు ఇచ్చింది. అమరావతి రైతులు దాఖలు చేసిన రెండు పిటిషన్ లు లీగల్ (న్యాయపరం) గా సంబంధం లేదు కానీ లాజికల్ గా సంబంధం ఉంది. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే.. ఆరు నెలల్లో అమరావతిలో అభివృద్ధి చేయాలని హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద నిధులు, వనరులు లేవనీ, అభివృద్ధి చేయడానికి రెండు మూడేళ్లు పడుతుందని ప్రభుత్వం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఇలా పలు మార్లు అఫిడవిట్ దాఖలు చేయడం వల్ల కోర్టు దిక్కరణ చర్యల నుండి తప్పుకుంటోంది ప్రభుత్వం. మూడు రాజధానులు చేస్తామని కోర్టుకు ప్రభుత్వం తెలియజేయలేదు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మరో సారి మూడు రాజధానుల బిల్లు ఎందుకు తీసుకువస్తుంది అంటే .. గతంలో 2019 లో శాసనసభలో ఆమోదం పొందిన వికేంద్రీకరణ బిల్లుకు శాసనసమండలిలో ఆమోదం పొందలేదు. శాసనసమండలి ఆ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపింది. ఆ తర్వాత ప్రభుత్వం 2020 మార్చి నెలలో మరో సారి అసెంబ్లీ లో వికేంద్రీకరణ బిల్లుకు ఆమోదం తేలిపి శాసనసమండలితో సంబంధం లేకుండా గవర్నర్ కు పంపి ఆమోదంతో చట్టం చేసింది. అయితే మండలితో సంబంధం లేకుండా నేరుగా గవర్నర్ ద్వారా ఆమోదం పొందటం చట్టం, రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లు అవుతుంది. దీంతో హైకోర్టులో దీనిపై వ్యతిరేక తీర్పు వస్తుందన్న భావనతో ముందుగానే ఆ బిల్లును ఉపసంహరించుకుంది. సీఆర్డీఏను కొనసాగిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఆ బిల్లు ఉపసంహరించుకుంటున్న సందర్భంలోనే న్యాయపరమైన చిక్కులు రాకుండా పకడ్బంది (చట్టబద్దంగా) మూడు రాజధానుల బిల్లు తీసుకువస్తామని తెలిపింది. గతంలో తీసుకువచ్చిన బిల్లుకు చట్టబద్దత లేదు కాబట్టి ఇప్పుడు తాజాగా చట్టబద్దంగా తీసుకురావాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పుడు శాసనమండలిలోనూ వైసీపీకి బలం ఉంది కాబట్టి ఉభయ సభల్లో వికేంద్రీకరణ బిల్లుకు ఆమోదింపజేసుకుని చట్టం చేస్తుంది. ఇలా ప్రొసీజర్ ప్రకారం బిల్లు ఆమోదించి ప్రభుత్వం చట్టం చేస్తే కోర్టులు కూడా వాటిపై జోక్యం చేసుకునే అవకాశం ఉండదు.



# మహిళ అక్రమ రవాణా నిరోధక కేంద్రాలు

మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ ఇటీవల మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయనున్నారని, నిర్భయ నిధిని ఉపయోగించి అన్ని జిల్లాల్లో మానవ నిరోధక నిరోధక విభాగాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళల భద్రత కోసం పనిచేస్తున్న ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం దీని లక్ష్యం. ఈ చర్య మహిళల భద్రతను బలోపేతం చేయడం మరియు వారిలో ఎక్కువ భద్రతా భావాన్ని కలిగేలా చేస్తుందన్నారు. అక్టోబర్ 22 న, డబ్ల్యుసిడి కార్యదర్శి రవీంద్ర పన్వర్ అధ్యక్షతన నిర్భయ ఫ్రేమ్‌వర్క్ కింద సాధికారిక కమిటీ (ఇసి) పోలీసు స్టేషన్లలో ఉమెన్ హెల్ప్ డెస్కుల (డబ్ల్యుహెచ్‌డి) కార్యాచరణ కోసం వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి రెండు ప్రతిపాదనలను అనుకూలంగా అంచనా వేయడం జరిగింది. 10,000 పోలీస్ స్టేషన్లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడానికి, భారతదేశంలోని మిగిలిన జిల్లాల్లో AHTU లను విస్తరించడానికి 100 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ MHA ని కోరింది. ప్రస్తుతం, దేశంలోని 146 జిల్లాల్లో AHTU లు పనిచేస్తున్నాయి. అక్రమ రవాణాకు గురైన మహిళలు, బాలికల భద్రత కోసం 100 కోట్ల రూపాయల వ్యయంతో AHTU లను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కమిటీ పరిశీలించి సిఫారసు చేసింది. సరైన పర్యవేక్షణ మరియు రిపోర్టింగ్ విధానం కూడా ఏర్పాటు చేయాలి. ఈ AHTU ల ఏర్పాటుకు 100 శాతం ఖర్చును MHA ప్రతిపాదన ప్రకారం నిర్భయ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం భరించాలని సిఫారసు చేసింది. మానసిక–సామాజిక మరియు న్యాయ సలహా, సహాయం కూడా చేయాలని ec సూచించింది. ఈ AHTU ల ద్వారా లబ్ధిదారులకు లభిస్తుంది "అని WCD మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలియచేసారు. AHTU ల పనితీరును సమన్వయం చేయడం పర్యవేక్షించడం, వారి డేటాను ec మరియు WCD మంత్రిత్వ శాఖతో పంచుకోవడం కోసం రాష్ట్ర స్థాయి నోడల్ అధికారుల నామినేషన్ ఉండేలా చూడాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖను అభ్యర్థించారు. WHD లు పోలీసింగ్ వ్యవస్థ ద్వారా మహిళల ఫిర్యాదుల పరిష్కారానికి లింగ సున్నితమైన డెస్కులు, అలాగే మహిళలు మరియు పిల్లలపై నేరాలపై దృష్టి సారించి పోలీసుల మెరుగైన సమాజ పరస్పర చర్యకు ఉత్ప్రేరకాలు. బాధిత మహిళలు మరియు బాలికలు ఎటువంటి సంకోచం మరియు భయం లేకుండా పోలీస్ స్టేషన్లను సంప్రదించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి ఇవి సహాయపడతాయి తెలిపింది. చట్టాలు ఎన్నివున్నా... శాసనాలు ఎన్నిచేసినా సక్రమంగా అమలు జరిగితేనే వాటి ఫలితాలు అందుతాయనేది కాదనలేని సత్యం. మహిళల అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని ప్రభుత్వాలు సరికొత్త చట్టాలతో ముందుకొస్తున్నా... వాటి అమలు తీరే ప్రశ్నార్థకంగా మారింది. లోపభూయిష్టమైన సిబ్బంది పనితనం చట్టాలపాలిట శాపంగా మారింది. అందుకనే చట్టాలు ఉనికి కోల్పోతు న్నాయేగాని ఫలితాన్ని ఇవ్వడంలేదనేది సత్యం!




ఫీడ్ బ్యాక్ టు ఆంధ్రలక్ష్మి
'ఆంధ్రలక్ష్మి' వారపత్రికకు సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి.... మేము నిర్భయంగా ప్రచురిస్తాం... మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం.
Cell : 9640300529
వార్తలకై www.andhralaxmitelugu.in చూడండి
email : Andhralaxminews@gmail.com
www. andhralakshmi@gmail.com, facebook.com/andharalaxmi

# అన్నను కార్నర్ చేసిన షర్మిల.. జగన్ చుట్టూ చిక్కులు...!



ఒక్కొక్కసారి కొన్నికొన్ని విషయాలను పట్టించుకోకపోవడమే మంచిది. అలా పట్టించుకుంటే.. మనకేదో మేలు జరుగుతుందని అనుకుంటే.. అదే పెద్ద తప్పిదం అయి కూర్చుంటుంది. ఇప్పుడు ఏపీ సీఎం జగన్ విషయంలో ఇలానే జరుగుతోంది. ఆయనేదో తన చెల్లెలు.. కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిలపై జాలి చూపించాలని అనుకున్నారో.. లేక.. షర్మిలపై ప్రేమ కురిపించాలని అనుకున్నారో.. ఓ నేషనల్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. “కడపలో మీ చెల్లెలు గెలుస్తుందా?” అని అడిగిన ప్రశ్నకు సీఎం జగన్ వెంటనే చెప్పిన జవాబు.. “ఆమె కు డిపాజిట్ కూడా రాదు” అని. అయితే.. అక్కడితో ఆయన ఆగిపోలేదు. దీనికి కొనసాగింపుగా.. కడప ప్రజలకు ఎవరు ఎంటో తెలుసని.. షర్మిలకు డిపాజిట్ కూడా రాదని.. అదే తనను బాధిస్తోందని.. జాలి కూడా కలిగేలా చేస్తోందని చెప్పారు. అయితే.. ఈ వ్యాఖ్యల వల్ల జగన్ ఏం ఆశించారో.. తెలియదు కానీ.. ఆయనకు .. మాత్రం షర్మిల నుంచి బలమైన కౌంటర్ వచ్చింది. అంతేకాదు.. ఆమె దీనిని ప్రజల్లోకి కూడా తీసుకువెళ్లారు. షర్మిల తాజాగా ఏమన్నారంటే.. “నీ చెల్లిపై నీకు నిజంగా ప్రేమ ఉంటే.. నీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డిని నామినేషన్ వెనక్కి తీసుకునేలా చెయ్యి” అని కౌంటర్ ఇచ్చారు. అంతేకాదు.. అవినాష్ రెడ్డి నామినేషన్ వెనక్కి తీసుకుంటే.. నీకు నీ చెల్లెళ్లపై ప్రేమ ఉందని.. కనీసం వివేకానందరెడ్డి చనిపోయాడన్న.. బాధైనా ఉందని ప్రజలు నమ్ముతారని చెప్పుకొచ్చారు. లేకపోతే.. నీ అంత దుర్మార్గుడు మరొకరు ఉండరని ప్రజలు నమ్ముతారని చెప్పారు. ఈ విషయాన్ని తాము ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్తామన్నారు. కడప ప్రజలకు అంతా తెలుసునని అంటున్న జగన్.. ఏం తెలుసో చెప్పాలని అన్నారు. ఇదే సమయం లో షర్మిల తన వదిన.. సీఎం జగన్ భార్య భారతిపైనా తీవ్ర విమర్శలు గుప్పించారు. “జగన్ రెండు రిమోట్ల మధ్య తిరుగుతున్నాడు. ఒకటి ఢిల్లీ రిమోట్. రెండో ఇంట్లో రిమోట్. ఢిల్లీలో రిమోట్ అయినా..(బీజేపీ), ఇంట్లో రిమోట్(భారతి) అయినా.. ‘బీ’– అక్షరంతోనే ప్రారంభమవుతాయి” అని షర్మిల వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# వైఎస్ జగన్.. తండ్రిని మించిన తనయుడవుతారా...?



వైఎస్ జగన్.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసుడు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉండగానే రాజకీయాల్లోకి వచ్చిన వైఎస్ జగన్ అప్పట్లోనే కడప ఎంపీగా ఎన్నికయ్యారు. అయితే తండ్రి పదవి ఉన్నంత కాలం జగన్ రాజకీయంగా అంత యాక్టివ్‌గా లేరు. ఏదో తన వ్యాపారాలు తాను చూసుకునేవారు.. వైఎస్ హఠాన్మరణం తర్వాత ఒక్కసారిగా సీన్ మారిపోయింది. తండ్రి మరణం తర్వాత ఏకంగా సీఎం అవ్వాలని అప్పట్లో జగన్  ఎమ్మెల్యేల సంతకాలు సేకరించారన్న వాదనలు ఉన్నాయి. తండ్రి హఠాన్మరణం తర్వాతే వైఎస్ జగన్ రాజకీయ జీవితం ప్రారంభమైందని చెప్పుకోవచ్చు. ఓదార్పు యాత్రకు కాంగ్రెస్ హైకమాండ్ అనుమతి ఇవ్వకపోవడం ద్వారా మొదలైన తిరుగుబాటు జగన్‌ను సిసలైనా రాజకీయ నాయకుడిగా రాటు తేల్చింది. దేశంలో అత్యంత శక్తివంతురాలైన నేతగా ఉన్న సోనియాగాంధీతోనే ఢీకొట్టేందుకు కూడా వెనుకాడని వైఎస్ జగన్ ధైర్యం అప్పట్లో చాలామంది చేత అది దుస్సాహసం అనిపించేలా చేసింది. కానీ జగన్ మాత్రం.. తాను నమ్మిందే చేశాడు. ఎక్కడా ఎవరికీ తలవంచలేదు. అందుకు ఫలితంగానే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తండ్రి పదవిని అడ్డం పెట్టుకుని ఆస్తులు పోగేసుకున్నాడని జగన్‌పై ఎన్నో కేసులు పెట్టారు. అరెస్టు చేశారు. పదహారు నెలలపాటు చంచల్‌గూడ జైలులో ఉంచారు. తాను జైలులో ఉన్నా పార్టీని బతికించుకున్నాడు. అప్పట్లో జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీని గెలిపించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత 2014 ఎన్నికల్లో స్వల్ప తేడాతో అధికారం అందుకోలేకపోయాడు. ఆ తర్వాత ఐదేళ్ల పాటు విపక్షంలో ఉన్నాడు జగన్. చంద్రబాబు తన పార్టీ ఎమ్మెల్యేలను లాక్కుని మంత్రి పదవులు ఇచ్చి మరీ పార్టీని బలహీన పరిచినా.. ధైర్యంగానే ఎదుర్కొన్నాడు. జనంలో ఉంటూ.. జనం సమస్యలు వింటూ.. ప్రజానేతగా గుర్తింపు పొందాడు. 2019లో అధికారం చేపట్టిన జగన్.. తండ్రి వైఎస్ఆర్‌ను గుర్తు తెచ్చేలా సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పాలన సాగించాడు. విపక్షాలు బటన్ నొక్కుడు సీఎం అని వెక్కిరించినా.. ఆ బటన్ నొక్కడం ద్వారానే ప్రజా సంక్షేమం జరిగిందని.. అదే తనను గెలిపిస్తుందన్న దీమాతో ఉన్నాడు. ఇప్పటికే ఐదేళ్లు సీఎంగా చేయడం ద్వారా వైఎస్‌ను సమం చేసిన జగన్.. మళ్లీ గెలిచి.. తండ్రికి మించిన తనయుడు అనిపించుకుంటారా లేదా అన్నది చూడాలి.

# ఎన్నికల ‘కోడ్’ సాకు చూపి విధులనుంచి తప్పుకొంటున్న పోలీస్, రెవిన్యూ..!

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ సర్వసాధారణమైన అంశం. ప్రతి ఐదేళ్లకొక సారి ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నికచేసి శాసన సభలకు పంపటం పరిపాటి. వాటి నిర్వహణ పటిష్టంగా వుండాలని, నియమిత కాలం నిర్ణయించుకొని ఆ కాలంలో ఇతర విధులకంటే కూడా అత్యంత శ్రద్ధాసక్తులతో ఎన్నికల నిర్వహణలో సిబ్బంది నిమగ్నమైవుంటుంది. అయితే ఈ విధివిధానాలు రూపొందించటంలోనే సాధారణ పరిపాలనకు ఎలాంటి ఆటంకం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై వుంటుంది. ఎన్నికల కమిషన్ తన ఎన్నికల నిర్వహణకోసం సిబ్బందిని ఎంపిక చేసుకొని వారికి నిర్వహణ బాధ్యతలు అప్పజెప్తుంది. అయితే వాటిని సాకుగా చూపి స్థానికంగా వున్న పోలీసు సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది తమ విధుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ ఎన్నికల ‘కోడ్’ అమలులో వుంది.. మేము ఏమిచేయలేమని ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతున్నారు. దీంతో సాధారణ పరిపాలన కుంటుపడి ప్రజల తక్షణ అవసరాలకు సంబంధించిన పాలనా సహకా రం లభించకపోవడంతో ముఖ్యమైన పనులన్నీ ఆగిపోతున్నాయి. ఈ వ్యవస్థ ఇలా కొనసాగడం వల్ల నిర్దిష్టమైన రెండు, మూడు మాసాల కాల వ్యవధిలో ప్రజలు ప్రభుత్వం నుండి ఎలాంటి సేవలను అందుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితి లో మార్పు వుండాలని ప్రజలు కోరుకుంటున్నా రు. ఎన్నికల నిర్వహణ కోసం విధుల్లో నియ మింపబడిన అధికారులు తప్ప మిగిలినవారు తమ విధులను యథావిధిగా కొనసాగించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యంగా లా & ఆర్డర్ పరిరక్షణలో పోలీసు



శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని స్పష్టంగా అర్థమవుతోంది. స్టేషన్ డ్యూటీల్లో సక్రమంగా లేకపోవడం, రాత్రి పికిటింగ్‌లు ఏర్పాటుచేయకపోవడం, తమ విధులనుంచి తెలివిగా తప్పుకొంటున్న పోలీసుల అసమర్థతవల్ల నేరస్తులు, అసాంఘిక శక్తులు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. గత రెండు మాసాలుగా హత్యలు, లూఠీలు, మానభంగాలు పెరిగిపోయాయంటే... ఈ ఎలక్షన్ల సాకుగా చూపి పోలీసులు తమ విధులపట్ల నిర్లక్ష్యం వహించ డంవల్లనే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే రెవిన్యూలో సైతం పనులు దీర్ఘకాలికంగా జాప్యం జరుగుతూనే వుంది. దీనికి కూడా రెవిన్యూ సిబ్బంది ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి తెలివిగా విధులనుంచి తప్పుకొంటున్నారు. పని భారం అధికంగా లేని ప్రభుత్వ శాఖలను గుర్తించి వాటిలో విధులను సక్రమంగా నిర్వర్తించ కుండా దీర్ఘకాలిక సెలవులతో కాలయాపన చేస్తూ... జీతాల సమయానికే కార్యాలయానికి వచ్చే సిబ్బంది ఎంతోమంది వుండగా... అలాంటి వారిని ఎన్నికల విధులకు వినియోగించుకోవా ల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా ప్రయ త్నించకుండా వుండటంపట్ల పలు విమర్శలు ఎదురవుతున్నాయి. ఎప్పుడూ పనిలో ఉండాల్సిన రెవిన్యూ విభాగం లాంటి శాఖనుంచే సిబ్బందిని ఎన్నికల విధులకు మళ్లించి ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్న అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. సమాచారశాఖ, వ్యవసాయశాఖ ప్రణాళికాశాఖ, గణాంకాల విభాగం ఇలాంటి ఎన్నో శాఖలు పనులు లేకుండా జీతాలు తీసుకునేందుకే వున్నట్టు గోచరిస్తున్న ఇలాంటి శాఖల నుంచి సిబ్బందిని ఎన్నికలకు వినియోగించుకోకుండా, ఎప్పుడూ పనిభారం అధికం కలిగిన రెవిన్యూ శాఖ నుండి మాత్రమే అధిక శాతం మందిని ఎన్నికల విధులకు ఉపయోగించటంవల్ల ప్రధాన మైన సమస్యల పరిష్కారంలో అలసత్వం ఏర్పడు తుంది. ఈ పరిస్థితి నుంచి తమను తాము సమీక్షించుకొని సిబ్బందిని వినియోగించుకునే విధానంలో ప్రజలకు ఆటంకం కలగకుండా ప్రజాపనులు నిర్ద్వంధంగా ఆగిపోకుండా ఎప్పటి లాగే కొనసాగే విధంగా ఏర్పాటు చేసుకొని ప్రజలకు అవసరానికి తగిన సేవలందించాలని కోరుకుంటున్నారు. పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో తన దృష్టిని సారించకపోతే... సమాజం తీవ్రమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఆ పరిస్థితిని రుజువు చేస్తున్నాయి. చిన్నచిన్న గొడవలు సైతం హత్యల వరకు వెళ్ళి యువకుల జీవితాలు బలౌతున్న పరిస్థితులు కళ్లెదుట కనిపిస్తున్నాయి. ఎంతో జీవితం వున్న యువత రం చిన్నపాటి తగాదాలకే హత్యలకు గురి కావడం, నేర స్వభావానికి లోను కావడం లాంటివి పోలీసుల నిర్లక్ష్యంవల్లనే జరుగుతున్నా యనే ఆరోపణలు వున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణలో అతి సున్నితమైన అంశాలను సైతం పరిగణలోకి తీసుకొని రాగద్వేషాలకు అతీతంగా సమాజంపై కఠినమైన దృష్టినిపెట్టి నేరాలను, నేర స్వభావాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

Edited, Printed, Published and Owned by Shaik Ghouse Basha, Printed at Mohammed Press, D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001, Andhra Pradesh, Publihsed at D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001. Andhra Pradesh,
Editor : Shaik Ghouse Basha  Cell : 9640300529